విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతుంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9491134365

TGTEL/26/A6221

తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక

యాదాద్రి భువనగిరి	సంపుటి: 01	సంచిక : 95	సోమవారం	2-11 -2026	ఎడిటర్: యంజాల ప్రవీణ్	పేజీలు: 08	వెల: రూ.2/-
Yadadri Bhuvanagiri	Volume:01	Issue:95	Monday	2-11-2026	Editor:Yamjala praveen	Pages:08	Cost:2/-

అయోధ్యలో లక్ష దీపోత్సవం

అయోధ్య: పవిత్ర నగరమైన అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ప్రాంగణం లక్ష దీపాలతో వెలిగిపోనుంది. శనివారం సమావేశం నిర్వహించిన ఆలయ ట్రస్టు.. ప్రాంగణాన్ని ఐదు జోన్లుగా విభజించి దీపోత్సవ కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేసింది. ప్రతి జోన్‌కు బాధ్యులను, బృందాలను నియమించి, వారి బాధ్యతలను కూడా స్పష్టంగా నిర్దేశించింది. ఆలయ ప్రాంగణమంతటా దీపాలను వెలిగించేందుకు సుమారు వెయ్యి మంది స్వచ్ఛంద సేవకులు సహకరించనున్నారని, రాబోయే 5 రోజుల్లో క్షేత్రస్థాయిలో అవసరమైన ఏర్పాట్లు పూర్తవుతాయని పేర్కొంది. ఆలయ ప్రాంగణం, గ్రీన్ హౌస్, యజ్ఞశాల ప్రాంతాల్లో మొత్తం 30,000 దీపాలు, కుబేర్ తిల, సప్తమండపం, శేషావతార ఆలయం, హుతాత్మ స్మారకం, పంచవటి జోన్లలో 30,000కు పైగా దీపాలు వెలిగిస్తారు.

ఫైటర్ జెట్లను పెంచుతాం!

- తేజస్, ఆమ్కా వంటి దేశీయ ప్రాజెక్టులకు ప్రోత్సాహం
- త్రివిధ దళాల సమన్వయాన్ని ఇనుమడింప జేయడం
- 'వాయు'దార్శనికత.. ఇవే ప్రాథామ్యాలు
- ఏఐఎఫ్ నూతన అధిపతి అశుతోష్ దీక్షిత్ వెల్లడి



2లో

నిందితుడు హేమంత్ పై పోలీసుల కాల్పులు

- నిన్న రాష్ట్రాదులో బాలికపై రంపంతో దాడి
- ఆత్మకూరు అడవుల్లో పట్టుకునేందుకు యత్నించగా రాళ్ల దాడి
- ఆత్మరక్షణ కోసం కాల్పులు ఏ జరిపినట్టు పోలీసుల వెల్లడి
- నిందితుడు హేమంత్ పరిస్థితి విషమం, ఆసుపత్రికి తరలింపు
- బెంగళూరులో చికిత్స పొందుతున్న బాధితురాలు గోపిక



2లో

బెంగాల్ హక్కుల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం..

వెనక్కి తగ్గేది లేదు

- ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో ఉన్నాయన్న మమతా బెనర్జీ
- ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు
- ఆలయాలు, మసీదులు, వక్ఫ్ ఆస్తులపైనా అక్రమాలంటూ విమర్శలు
- యువత ముందుకు రావాలి.. సేవ్ ఇండియా -సేవ్ డెమోక్రసీ నినాదం



2లో



ప్రజాస్వామ్య చరిత్రలో ఇది మరో చీకటి రోజు

- మున్సిపల్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ జగన్ ఆరోపణలు
- పులివెందులలో 70 బూతుల్లో ఏజెంట్లకు అనుమతి నిరాకరణ
- పలు ప్రాంతాల్లో రిగ్గింగ్ జరిగిందని విమర్శలు
- పోరాడిన మహిళలు, కార్యకర్తలకు జగన్ అభినందనలు

ఆంధ్రప్రదేశ్‌లో ముగిసిన పట్టణ స్థానిక సంస్థల (మున్సిపల్) ఎన్నికల్లో అధికార పక్షం విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా సాగిన ఈ పోలింగ్ ప్రక్రియపై ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఘాటుగా స్పందించారు.

- మిగతా 2వ పేజీలో

'జ్ఞానేశ్ కుమార్ తర్వాత మీ వంతే మోదీజీ'..

- రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి అనుమతించం..
- 2024 ఎన్నికలు దొంగిలించబడ్డాయి..
- జ్ఞానేశ్ కుమార్‌ను జైలుకు పంపిస్తాము..
- జ్ఞానేశ్ తర్వాత ప్రధాని మోడీ వంతు..
- ఇండియా కూటమి ర్యాలీలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు..
- 15 శాతం ఓటర్ల పేర్లు తొలగించారని వ్యాఖ్య
- దేశ సంపద కొంత మంది చేతుల్లోనే ఉందని విమర్శ

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయనను పదవి నుంచి తొలగించి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఆ తర్వాత తమ పోరాటం ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై ఉంటుందని పేర్కొన్నారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి నిర్వహించిన భారీ ర్యాలీలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు.

- మిగతా 2వ పేజీలో





20 కోట్ల ఓట్ల తొలగింపుకు కేంద్రం కుట్ర..

- మోదీని గద్దె దించే వరకు విశ్రమించం
- ఓటు హక్కును కాలరాసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపణ
- ఇప్పటికే 13.50 కోట్ల ఓట్లు తొలగించారని రేవంత్ వ్యాఖ్యలు
- రైళ్లు రద్దు చేసినా ఢిల్లీకి చేరుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు
- మోదీని గద్దె దించే వరకు పోరాడుతామని సీఎం పిలుపు

దేశంలో పేదలు, దళితులు, గిరిజనులు , మహిళలకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించిన 'ఇండియా' కూటమి మెగా ర్యాలీలో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన ఆయనకు తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..

- మిగతా 2వ పేజీలో

రాజ్యమేలుతున్న 'రాబంద్'

- ఆదిలాబాద్ రైతు గర్జన సభలో కేటీఆర్ ఫైర్
- రాష్ట్రంలో రైతులు వ్యవసాయం చేసుకునే పరిస్థితి లేదు
- నీళ్లు, కరెంట్, పరిశ్రమలు, పథకాలు అన్నీ బంద్ చేసిన్రు

ఆదిలాబాద్: 'యాసంగి పంట వేస్తే ఆ తప్పు నాది.. ప్రభుత్వానిది కాదంటూ రైతు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది. రాష్ట్రంలో రైతులు వ్యవసాయం చేసుకునే పరిస్థితి కూడా లేకుండా పోయింది. కేసీఆర్ పాలనలో రైతుల పరిస్థితి బ్రహ్మాండంగా ఉండేది. పుట్లకొద్దీ వడ్లు పండించారు. ఇప్పుడు దుక్కి దున్నొద్దు.. భూములను పడావు పెట్టుకోవాలని చెప్పే పరిస్థితి వచ్చింది.

- మిగతా 2వ పేజీలో



గతంలో ఎన్నడూ లేనంతటి స్ఫూర్తి కనిపిస్తోంది..

- కూటమి నేతలతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- పోలింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలని కేడర్‌కు సూచన
- వృద్ధులు, వికలాంగులను పోలింగ్ కేంద్రాలకు తరలించాలని పిలుపు
- ప్రత్యర్థులు రెచ్చగొట్టినా సంయమనం పాటించాలని హితవు
- గతంలో కనీవినీ ఎరుగని స్ఫూర్తితో ఎన్నికలు జరుగుతున్నాయని వ్యాఖ్య

రాష్ట్రంలో నేడు జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ సరళిపై ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి పార్టీల ముఖ్య నేతలు, శ్రేణులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగ్ తీరుతెన్నులను సమీక్షిస్తూ, పోలింగ్ శాతం పెంచేందుకు పలు కీలక సూచనలు చేశారు. టెలీకాన్ఫరెన్సులో చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. "గతంలో జరిగిన ఏ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఇంతటి స్ఫూర్తి కన్పించలేదు. కొన్ని మున్సిపాలిటీల్లో ప్రజలు ఓట్లు వేసేందుకు బారులు తీరడం శుభపరిణామం"

- మిగతా 2వ పేజీలో



దూసుకొస్తున్న 'మురసు' తుపాను..

- బంగాళాఖాతంలో బలపడిన 'మురసు' తుపాను
- తీవ్ర తుపానుగా మారి ఏపీ తీరం వైపు వేగంగా పయనం
- నవంబర్ 2న అర్ధరాత్రి నెల్లూరు-నర్సాపురం మధ్య తీరం దాటే అవకాశం
- కోస్తాంధ్ర, తెలంగాణ, రాయలసీమలో భారీ నుంచి అతి భారీ వర్ష సూచన
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని భారత వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరిక



2లో

నిందితుడు హేమంత్ పై పోలీసుల కాల్పులు

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాప్తాడు పాఠశాల విద్యార్థినిపై దాడి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. పరారీలో ఉన్న నిందితుడు హేమంత్‌పై పోలీసులు కాల్పులు జరిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆత్మకూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా, అతను పోలీసులపై రాళ్లతో దాడికి యత్నించాడు. దీంతో ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపినట్టు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన హేమంత్‌ను అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. రాప్తాడు మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థినిపై ఆమె బంధువైన హేమంత్ దారుణంగా దాడి చేసిన విషయం తెలిసిందే. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని తరగతి గదిలోకి ఎలక్ట్రిక్ రంపంతో (చైన్‌సా) ప్రవేశించిన హేమంత్.. బాలిక తల, ముఖం, వీపు భాగాలపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కాళ్లకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం నిందితుడు రంపాన్ని అక్కడే వదిలేసి పరారయ్యాడు. తీవ్ర గాయాలపాలైన బాలికను తొలుత అనంతపురం ఆసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆమె ప్రస్తుతం మణిపాల్ ఆసుపత్రిలోని పీఐసీయూలో చికిత్స పొందుతోంది. ఈ కేసును సవాలుగా స్వీకరించిన పోలీసులు, నిందితుడి కోసం గాలింపు ముమ్మరం చేశారు. హేమంత్ ఆత్మకూరు సమీపంలోని అడవుల్లో దాక్కున్నట్టు సమాచారం అందడంతో, ప్రత్యేక బృందాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి.

గతంలో ఎన్నడూ లేనంతటి స్ఫూర్తి కనిపిస్తోంది..

అని ఆయన అన్నారు. అదే సమయంలో, కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఓటర్లందరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని నేతలకు సూచించారు. “కొంత మంది వృద్ధులు, వికలాంగులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేకపోవచ్చు. అలాంటి వారిని గుర్తించి, సమన్వయంతో కేంద్రాలకు తీసుకురావాలి. ఎన్నికల నిబంధనలను పాటిస్తూనే పోలింగ్ శాతం పెరిగేలా చూడాలి” అని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కూటమి శ్రేణులకు చంద్రబాబు పలు జాగ్రత్తలు సూచించారు. “ప్రత్యర్థులు రెచ్చగొట్టేలా కుట్ర కోణంలో వ్యవహరిస్తారు. మన శ్రేణులు సంయమనం పాటించాలి. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే వెంటనే ఎన్నికల అధికారులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలి” అని ఆయన దిశానిర్దేశం చేశారు.

బెంగాల్ హక్కుల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం.. వెనక్కి తగ్గేది లేదు

దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం , పౌరుల ప్రాథమిక హక్కులు తీవ్ర ముప్పులో పడ్డాయని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని బీజేపీ సర్కార్‌పై విరుచుకుపడ్డారు. ఓటు హక్కుల పరిరక్షణ కోసం, ప్రజాస్వామ్య కాపాడుకోవడానికి పోరాడుతున్న విద్యార్థులు, యువత, న్యాయవాదులు, పౌరసమాజ సంస్థలతో పాటు కాక్రోచ్ జనతాపార్టీ నేతలకు ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక అభినందనలు తెలిపారు. బెంగాల్ ప్రజలు ప్రస్తుత పరిణామాల వల్ల తీవ్ర బాధితులుగా మారారని, రాష్ట్ర హక్కుల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దేశంలో ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరుగుతున్నాయని మమతా బెనర్జీ ఆరోపించారు. ఓటర్ల జాబితాల నుంచి లక్షలాది మంది ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తున్నారని, ఓటర్ల గుర్తింపు వివరాలు, సిమ్ కార్డుల వ్యవహారాన్ని దుర్వినియోగం చేస్తూ ఓటర్ల హక్కులపై తీవ్ర అనుమానాలు రేకెత్తిస్తున్నారని విమర్శించారు.

రాజ్యమేలుతున్న ‘రాబంద్’

నీళ్లు బంద్.. పరిశ్రమలు బంద్.. కరెంట్ బంద్.. చివరకు వ్యవసాయం కూడా బంద్..రాజ్యమేలుతున్నది ‘రాబంద్’..’ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రైతు గర్జన సభలో ఆయన ప్రసంగించారు. ‘ఎల్ నినో ఉత్త ముచ్చట.. అది వేరేవాళ్లకు ఉండవచ్చు.. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లను వాడుకుంటే అసలు తెలంగాణలో కరువే ఉండదు.. కే అంటే కాలువలు.. సీ అంటే చెరువులు.. ఆర్ అంటే రిజర్వాయర్లు.. కాంగ్రెస్ అంటే కరువు, కన్నీళ్లు, వలసలు.. అందుకే ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువు. దీనికి రేవంత్‌రెడ్డిదే బాధ్యత..ఎనుకటి రోజులు తెస్తామని సీఎం గతంలో అన్నారు.. అన్నట్టే చేశారు.. కరువు రాక్షసిని మళ్లీ తీసుకొచ్చారు. చంద్రబాబు నాయుడు కుప్పంకు నీళ్లు తీసుకుపోయాడు. పక్కనే ఉన్న పాలమూరుకు రేవంత్ నీళ్లు ఇవ్వలేకపోయాడు. తెలంగాణ కంటే రెండింతల వర్షపాతం లోటు ఉన్న ఏపీ, కర్ణాటకలో లేని కరువు తెలంగాణలో ఎందుకు వచ్చింది? రైతులు ఒక్క సంవత్సరం ధైర్యంగా ఉండాలి. రైతు గర్జన వరుస సభలను నిర్వహిస్తాం.

ఫైటర్ జెట్లను పెంచుతాం!

న్యూఢిల్లీ: భారత వైమానిక దళాని(ఐఏఎఫ్)కి మంజూరైన యుద్ధ విమానాలను పూర్తి స్థాయిలో తిరిగి సమకూర్చుకోవడం, తేజస్, అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్(ఆమ్కా)వంటి దేశీయ ప్రాజెక్టులను ప్రోత్సహించడం తన ప్రాథమ్యాలని ఐఏఎఫ్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ చెప్పారు. త్రివిధ దళాల మధ్య సమన్వయాన్ని ఇనుమడింపజేయడం కూడా ఇందులో ఒకటని ఆయన వివరించారు. ‘వాయు’దార్శనికతలో భాగాలైన నిరంతర అప్రమత్తత, కార్యాచరణ సంసిద్ధత(విజిలెన్స్, ఆపరేషనల్ రెడీనెస్), ఆత్మనిర్భరత, యుద్ధ తంత్రంలో వినూత్న ఆలోచనలు, సాంకేతిక ఆవిష్కరణలు, త్రివిధ దళాల సమన్వయం, ఉమ్మడి భాగస్వామ్యంపై ప్రధానంగా దృష్టి సారిస్తానన్నారు. శనివారం ఐఏఎఫ్ 29వ అధిపతిగా అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు చేపట్టడం తెలిసిందే. ఆదివారం ఆయన రేస్ కోర్స్ ఎయిర్ పోర్స్ స్టేషన్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో గౌరవ వందన స్వీకరించిన అనంతరం మీడియాతో మాట్లాడారు.

‘జ్ఞానేశ్ కుమార్ తర్వాత మీ వంతే మోదీజీ’..



“జ్ఞానేశ్ కుమార్ తర్వాత మీ వంతే మోదీజీ” అంటూ ప్రధానిని ఉద్దేశించి హెచ్చరించారు. జ్ఞానేశ్ కుమార్ లేకపోతే మోదీ ప్రధాని, అమిత్ షా హోంమంత్రి అయ్యేవారు కాదని వ్యాఖ్యానించారు. దేశంలో ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసేందుకు ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు, చేర్పులు చేస్తున్నారని ఆరోపించారు. ఈవీఎంల ద్వారా కూడా ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని విమర్శించారు. మధ్యప్రదేశ్, హర్యానా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. 2024 ఎన్నికల తర్వాత దేశంలోని 15 శాతం మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారని రాహుల్ పేర్కొన్నారు. ఆ ఎన్నికలు చట్టవిరుద్ధంగా జరిగాయని, ప్రజల తీర్పును దొంగిలించారని ఆరోపించారు. ఓటర్ల పేర్ల తొలగింపు దేశద్రోహంతో సమానమని, ఇది అత్యంత తీవ్రమైన కేసుల్లో ఒకటని అభివర్ణించారు. ఈ ఆరోపణలకు ఎన్నికల సంఘం వెల్లడించిన గణాంకాలే ఆధారమని చెప్పారు. దేశ సంపద కొంత మంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతోందని రాహుల్ విమర్శించారు. రైతులు కష్టపడి పండించిన పంటకు తగిన ప్రతిఫలం దక్కాలని, చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు రావాలని అన్నారు. యువత, మహిళలు, కార్మికులు, రైతులకు హక్కులు దక్కడం లేదని ఆరోపించారు. దేశం ఇద్దరు ముగ్గురు సంపన్నుల సొత్తు కాదని, ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు ఉండాలని స్పష్టం చేశారు. అందరూ స్వేచ్ఛగా జీవిస్తూ, తమ కష్టానికి తగిన ఫలితం పొందే భారతదేశం కావాలని ఆకాంక్షించారు. తనకు మతం కంటే ప్రతి భారతీయుడి గొంతుకే ముఖ్యమని చెప్పారు. మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్‌లపై తనకు వ్యక్తిగత ద్వేషం లేదని, బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై దాడులు చేయబోమని అన్నారు. ప్రేమ, అహింస మార్గంలోనే పోరాడతామని, అయితే రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి మాత్రం అనుమతించబోమని హెచ్చరించారు. ఈ ఆందోళన ఏ ఒక్క పార్టీ కోసం కాదని, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసమని ఇండియా కూటమి నేతలు చెబుతున్నారు. మరోవైపు, ఎన్నికల సంఘం మాత్రం ఓటర్ల జాబితా సవరణలో అనర్హులు, మరణించినవారు, వేరే ప్రాంతాలకు వెళ్లిపోయినవారు, నకిలీ పేర్లను గుర్తించి తొలగిస్తున్నామని వివరిస్తోంది. సవరణలో గుర్తించిన 13.39 కోట్ల పేర్లన్నీ అర్హులైన ఓటర్ల తొలగింపుగా భావించరాదని స్పష్టం చేసింది. పేర్లు తొలగించిన, అర్హులైన ఓటర్లు నిబంధనల ప్రకారం మళ్లీ నమోదు చేసుకోవచ్చని తెలిపింది.

20 కోట్ల ఓట్ల తొలగింపుకు కేంద్రం కుట్ర..



కులాలు, మతాల పేరుతో ప్రజలను విభజించి ప్రధాని నరేంద్ర మోదీ వరుసగా అధికారంలోకి వచ్చారని, ఇప్పుడు దేశంలో దాదాపు 20 కోట్ల ఓట్లను తొలగించేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 400 కంటే ఎక్కువ సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చి, రిజర్వేషన్లను రద్దు చేయడంతో పాటు పేదలు, దళితులు, గిరిజనులు, మహిళల ఓట్లను తొలగించాలని బీజేపీ భావించిందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. అయితే ప్రజలు బీజేపీకి ఆ సంఖ్యను ఇవ్వకపోవడంతో ప్రధాని మోదీ వారిపై కక్ష పెంచుకున్నారని ఆరోపించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన ఓటు హక్కును లాక్కునేందుకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను కేంద్రం అడ్డుపెట్టుకుందని ధ్వజమెత్తారు. దేశంలో ఇప్పటికే 13.50 కోట్ల ఓట్లు తొలగించారని, మరో 20 కోట్ల ఓట్లను (మొత్తం ఓట్లలో 15 నుంచి 20 శాతం) తొలగించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారని మండిపడ్డారు. బీహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లలో ప్రయోగాత్మకంగా ఓట్ల తొలగింపునకు పాల్పడే బీజేపీ అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకోలేకపోయారు.. తెలంగాణ గళం ముందు తలవంచక తప్పలేదు రామ్‌లీలా మైదాన్ సభకు తెలంగాణ నుంచి దాదాపు 15 వేల మంది కాంగ్రెస్ కార్యకర్తలు తరలివచ్చేలా పీసీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేస్తే, చివరి నిమిషం వరకు నమ్మించి ఆ రైళ్లను రద్దు చేశారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. రైళ్లు లేకపోయినా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా సొంత ఏర్పాట్లతో ఢిల్లీకి చేరుకున్నారని తెలిపారు. నరేంద్ర మోదీ, అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కలసి ఎంత కుట్ర చేసినా తెలంగాణ బలమైన గళం ముందు, కాంగ్రెస్ శ్రేణుల కార్యదీక్ష ముందు తలవంచక తప్పలేదని పేర్కొన్నారు.

రాముడికి వానరసేనలా.. మోదీని దించేందుకు కాంగ్రెస్ సైన్యం

“పూర్వం రావణాసురుడిని ఓడించేందుకు శ్రీరాముడికి వానర సేన ఎలాగైతే తోడ్పడిందో, నేడు నరేంద్ర మోదీ అహంకార పాలనకు స్వస్తి పలికి ఆయనను అధికార పీఠం నుంచి గద్దె దించేందుకు కాంగ్రెస్ సైన్యం నిరంతరం పోరాడుతుంది” అని రేవంత్ రెడ్డి ఉద్బోధించారు. ఈ ప్రజాస్వామ్య పోరాటంలో విజయం సాధించే వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్ నుంచి ఇండియా కూటమి ఇచ్చే పిలుపును, సందేశాన్ని తెలంగాణలోని ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికీ చేరవేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ప్రజాస్వామ్య చరిత్రలో ఇది మరో చీకటి రోజు

ప్రజాస్వామ్య చరిత్రలోనే ఈరోజు మరో చీకటి అధ్యాయమని అభివర్ణించిన జగన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి హయాంలో రాష్ట్ర ఎన్నికల వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని ఆరోపించారు.

ఏజెంట్లను అడ్డుకుని దొంగ ఓట్లు.. 70 బూతుల్లో లోపలికి రానివ్వలేదు

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పోలింగ్‌లో భారీగా రిగ్గింగ్ జరిగిందని వైఎస్ జగన్ ఆరోపించారు. పోలింగ్ కేంద్రాల నుంచి వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బలవంతంగా బయటకు పంపివేసి, ఓటర్లను బహిరంగంగా బెదిరిస్తూ ఓటు హక్కు వినియోగించుకోకుండా అడ్డుకున్నారని విమర్శించారు. ఇదంతా పోలీసుల కళ్లముందే, వారి సహకారంతోనే జరిగిందని ధ్వజమెత్తారు. “ఒక్క పులివెందుల మున్సిపాలిటీలోనే మొత్తం 80 పోలింగ్ కేంద్రాలు ఉంటే.. అందులో 70 కేంద్రాల్లో వైసీపీ ఏజెంట్లను అసలు అనుమతించలేదు. పోలింగ్ బూతుల్లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లే లేనప్పుడు ఓటర్ల గుర్తింపును ఎవరు నిర్ధారిస్తారు?” అని జగన్ సూటిగా ప్రశ్నించారు.

రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి.. ప్రజల తీర్పును పక్కదారి పట్టించారు

కేవలం ఒక్క పులివెందుల మాత్రమే కాకుండా కడప, అనంతపురం, తిరుపతి, కర్నూలు, చిత్తూరు, ఒంగోలు, గుంటూరు, నెల్లూరు సహా విజయవాడ, విశాఖపట్నం, మాచర్ల, చిలకలూరిపేట, వినుకొండ, జమ్మలమడుగు, నంద్యాల వంటి అనేక ప్రాంతాల్లోనూ ఇదే రీతిలో అక్రమాలు సాగాయని జగన్ వెల్లడించారు. “ఇది ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నిక ఎంతమాత్రమూ కాదు.. అధికారంలో ఉన్నవారు తమకు నచ్చిన వారిని తామే ఎంపిక చేసుకునే ప్రక్రియ మాత్రమే. ప్రజల అసలైన తీర్పును పక్కదారి పట్టించేందుకు తీవ్ర ప్రయత్నం జరిగింది” అని విమర్శించారు.

కార్యకర్తలకు, మహిళలకు అభినందనలు

రాష్ట్రంలో ప్రజాస్వామ్య వ్యవస్థలను కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆరోపించిన వైఎస్ జగన్, ఇన్ని అడ్డంకులు, బెదిరింపులు ఎదురైనప్పటికీ వెనకడుగు వేయకుండా నిలబడిన పార్టీ శ్రేణులకు ధైర్యం చెప్పారు. అధికార పక్షపు అరాచకాలను తట్టుకుని, చివరి నిమిషం వరకు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కోసం ధైర్యంగా పోరాటం చేసిన వైఎస్సార్‌సీపీ మహిళలకు, నాయకులకు, కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

దూసుకొస్తున్న ‘మురసు’ తుపాను..

బంగాళాఖాతంలో ఏర్పడిన ‘మురసు’ తుపాను వేగంగా బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తోంది. ప్రస్తుతం నైరుతి, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ తుపాను, రానున్న 24 గంటల్లో తీవ్ర తుపానుగా మారనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. నవంబర్ 2వ తేదీ రాత్రి సమయంలో దక్షిణ కోస్తాంధ్రలోని నెల్లూరు, నర్సాపురం మధ్య, ఒంగోలుకు సమీపంలో ఇది తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేసింది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని, కొన్ని సందర్భాల్లో గాలి వేగం గంటకు 120 కిలోమీటర్లకు చేరుకోవచ్చని తెలిపింది. భారత వాతావరణ శాఖ ఆదివారం సాయంత్రం విడుదల చేసిన బులెటిన్ ప్రకారం, ‘మురసు’ తుపాను గత ఆరు గంటల్లో గంటకు 25 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ వాయవ్య దిశగా పయనించింది. ప్రస్తుతం ఇది చెన్నైకి ఆగ్నేయంగా 420 కిలోమీటర్లు, నెల్లూరుకు ఆగ్నేయంగా 490 కిలోమీటర్లు, మచిలీపట్నానికి ఆగ్నేయంగా 500 కిలోమీటర్లు, కావలికి తూర్పు ఆగ్నేయంగా 510 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఆదివారం రాత్రి నాటికి ఇది మరింత బలపడి తీవ్ర తుపానుగా రూపాంతరం చెందుతుందని అధికారులు స్పష్టం చేశారు. ఆ తర్వాత వాయవ్య దిశగా కదులుతూ నవంబర్ 2న సాయంత్రం లేదా రాత్రి వేళకు ఆంధ్రప్రదేశ్ తీరాన్ని సమీపిస్తుంది.

తీర ప్రాంత జిల్లాలపై తీవ్ర ప్రభావం

తుపాను తీరం దాటే సమయంలో దాని ప్రభావం దక్షిణ కోస్తాంధ్ర జిల్లాలపై తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా బాపట్ల, గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. సముద్రపు అలలు సాధారణం కంటే 1 నుంచి 1.5 మీటర్ల ఎత్తు వరకు ఎగిసిపడే అవకాశం (స్టార్మ్ సర్జ్) ఉందని, దీనివల్ల తీర ప్రాంతాలు జలమయం కావచ్చని అప్రమత్తం చేసింది. ఈ నాలుగు జిల్లాల్లో సముద్రపు పోటు ప్రభావం గరిష్ఠంగా ఉంటుందని ప్రత్యేకంగా పేర్కొంది. తుపాను ప్రభావంతో కోస్తాంధ్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలు, మత్స్యకారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

తుపాను గమనం, బలహీనత

నవంబర్ 2న రాత్రి తీరం దాటిన తర్వాత ‘మురసు’ తుపాను క్రమంగా బలహీనపడుతుంది. భూభాగంపైకి ప్రవేశించాక, నవంబర్ 3వ తేదీ ఉదయానికి తీవ్ర తుపాను నుంచి సాధారణ తుపానుగా మారుతుంది. ఆ తర్వాత మరింత బలహీనపడి వాయుగుండంగా, ఆపై అల్పపీడనంగా మారుతుందని ఐఎండీ అంచనా వేసింది. ఇన్ శాట్ 3డీఎస్ ఉపగ్రహ చిత్రాల ప్రకారం, తుపాను కేంద్రం వద్ద దట్టమైన మేఘాలు కేంద్రీకృతమై ఉన్నాయని, ఇది దాని తీవ్రతకు నిదర్శనమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. తీర ప్రాంత జిల్లాల అధికారులను సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రజలు అనవసర ప్రయాణాలు మానుకోవాలని, అధికారిక ప్రకటనలను అనుసరించాలని సూచించింది.

కోస్తాంధ్ర: నవంబర్ 1న అక్కడక్కడా భారీ వర్షాలు, నవంబర్ 2, 3 తేదీల్లో చాలా ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, కొన్నిచోట్ల కుండపోత (అత్యంత భారీ) వర్షాలు పడతాయి. నవంబర్ 4న కూడా అక్కడక్కడా భారీ వర్షాలు కొనసాగుతాయి. రాయలసీమ: నవంబర్ 2, 3 తేదీల్లో చాలా చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తెలంగాణ: నవంబర్ 2 నుంచి 4 వరకు చాలా ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు, నవంబర్ 3న కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తమిళనాడు, దక్షిణ ఒడిశా, ఛత్తీస్‌గఢ్: ఈ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో కూడా నవంబర్ 2 నుంచి 4 మధ్య భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే సూచనలు ఉన్నాయి.



మహిళల ప్రగతికి పొదుపు సంఘాలు ఊతం

- ఘనంగా చైతన్య వికాస్ సహకార సంఘం 20వ వార్షికోత్సవం

- హాజరైన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

తొలివెలుగు, వనస్థలిపురం: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తూ కుటుంబాల అభ్యున్నతితో పాటు సమాజ వికాసంలో భాగస్వాములు కావడం అభినందనీయమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ ఆర్టీసీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించిన 'చైతన్య వికాస్ మహిళా సహకార పొదుపు పరపతి సంఘం లిమిటెడ్' 20వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొదుపు అలవాటును పెంచుతూ, పరస్పర సహకారంతో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఇటువంటి సంఘాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. భవిష్యత్తులో ఈ సంఘం మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల ప్రతినిధులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలి: సర్పంచి కొండ ప్రమీల

ం జీపీ తీర్మానం, పెద్దల ఆమోదంతోనే మహిళా భవనం




తొలివెలుగు, రాజాపేట: గ్రామ పంచాయతీ తీర్మానం, ఊరి పెద్దల ఆమోదంతోనే మహిళా భవన నిర్మాణం చేపడుతున్నట్లు సింగారం సర్పంచి కొండ ప్రమీల పండరి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. బొగ్గుల చంద్రమ్మ ఇంటి వెనుక భాగంలో మహిళా భవనం నిర్మించాలని గత జూన్ 15న గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు వివరించారు. అంతేకాకుండా, భూమి పూజ కార్యక్రమంలో గ్రామంలోని అన్ని పార్టీల నాయకులు, పెద్దలు, పాలకవర్గ సభ్యులు పూర్తిస్థాయిలో పాల్గొన్నారని గుర్తుచేశారు. గ్రామాభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని కాంక్షించి చేపడుతున్న ప్రభుత్వ పక్కా భవనాల నిర్మాణాలకు గ్రామస్తులందరూ సహకరించాలని ఈ సందర్భంగా సర్పంచి విజ్ఞప్తి చేశారు.

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం

ం అమ్మవారికి నైవేద్యంగా బోనాల సమర్పణ

ం హాజరైన మాజీ కార్పొరేటర్లు నవజీవన్ రెడ్డి, నర్సింహా రెడ్డి





తొలివెలుగు, హయత్‌నగర్: స్థానిక గ్రామంలో శ్రీ నాభి శిల బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం రెండో రోజు నిర్వహించిన బోనాల సమర్పణ కార్యక్రమంలో హయత్‌నగర్, మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సంప్రదాయబద్ధంగా అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాజీ కార్పొరేటర్లు మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించడంలో ఇలాంటి గ్రామ ఉత్సవాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.

సందడిగా నకిరేకంటి మొగులయ్య బర్త్‌డే సంబరాలు

- రామన్నపేటలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన పార్టీ శ్రేణులు

తొలివెలుగు, రామన్నపేట: మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్‌లో బీజేపీ నకిరేకల్ నియోజకవర్గ పోటీ చేసిన ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నకిరేకంటి మొగులయ్య జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ రామన్నపేట మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి మొగులయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నకిరేకంటి మొగులయ్య ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, పార్టీలో మరింత ఉన్నత పదవులు అధిరోహిస్తూ ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ, స్టేట్ కౌన్సిల్ సభ్యులు



వనం అంజయ్య, టౌన్ అధ్యక్షులు గర్రె మురళి, గుండాల నరేష్, నాయకులు కట్ట యాదయ్య, జంగిలి సత్యనారాయణ, బెజ్జంకి శివకుమార్, మన్యం పద్మారెడ్డి, జల్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఓట్ బచావో--దేశ్ బచావో' సభకు హాజరైన పారిజాత నరసింహారెడ్డి





ం ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి బహిరంగ సభ

ం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి: డీసీసీ అధ్యక్షురాలు

తొలివెలుగు, మహేశ్వరం: ఏఐసీసీ, ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన 'ఓట్ బచావో – దేశ్ బచావో' భారీ బహిరంగ సభకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహారెడ్డి హాజరయ్యారు. జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆమె ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిజాత నరసింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను, ప్రజల ప్రాథమిక ఓటు హక్కును పరిరక్షించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కేంద్రంలో ఉన్న భాజపా ప్రభుత్వం రాజ్యాంగబద్ధ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. నిత్యావసరాల ధరల పెంపు, నిరుద్యోగం, రైతాంగ సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దేశంలో సమాఖ్య వ్యవస్థను, సాంప్రదాయ విలువలను కాపాడేందుకు ఇండియా కూటమి నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



తొలివెలుగు, రామన్నపేట: రామన్నపేట మండలంలోని సిరిపురం, వెల్లంకి, సర్నేనిగూడెం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై రైల్వే బ్రిడ్జి కింద వర్షపు నీరు భారీగా నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ బ్రిడ్జి కింద నీరు చేరి రహదారి చెరువును తలపిస్తున్నా సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షం పడితే రాకపోకలకు అంతరాయం:

శుక్రవారం కురిసిన వర్షానికి బ్రిడ్జి కింద భారీగా నీరు నిలిచిపోయింది. నీరు బయటకు వెళ్లేందుకు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రహదారిపై వరద నీరు చేరి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ మార్గంలో నిత్యం ప్రయాణించే రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి కింద నీటి లోతు తెలియక ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లలో వెళ్లేవారు భయాందోళనకు గురవుతున్నారు.

ప్రమాదాలకు నిలయంగా రహదారి:

రోడ్డుపై నీరు నిలవడంతో కింద ఉన్న గుంతలు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడే పరిస్థితులు నెలకొన్నాయి. రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించడం మరింత ప్రమాదకరంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య ఎదురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి:

సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి మోటార్ల సహాయంతో బ్రిడ్జి కింద నిలిచిన నీటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. భవిష్యత్తులో ఈ సమస్య పునరావృతం కాకుండా శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటు దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థుల కష్టాలు తీర్చేందుకు టీఆర్ ఫౌండేషన్ ఉదారత

- మోడల్ స్కూల్ వద్ద రూ.1.50 లక్షలతో బస్సు షెల్టర్ నిర్మాణం

- సొంత నిధులతో ముందుకొచ్చిన అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి: బస్సుల కోసం ఎండనక, వాననక గంటల తరబడి వేచి చూస్తూ ఇబ్బందులు పడుతున్న మోడల్ స్కూల్ విద్యార్థుల కష్టాలను గుర్తించిన టీఆర్ ఫౌండేషన్ అండగా నిలిచింది. విద్యార్థులకు నీడ కల్పించడంతో పాటు సౌకర్యవంతంగా వేచి ఉండేందుకు రూ.1.50 లక్షల సొంత నిధులతో బస్సు షెల్టర్ నిర్మించేందుకు ఫౌండేషన్ చైర్మన్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ ముందుకొచ్చారు. పాఠశాల ముగిసిన అనంతరం ఇళ్లకు వెళ్లేందుకు విద్యార్థులు బస్సుల కోసం దాదాపు గంటసేపు వేచి ఉండాల్సి వస్తోంది. సమీపంలో కనీసం నీడనిచ్చే చెట్టు కూడా లేకపోవడంతో ఎండ, వానలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల అవస్థలను గుర్తించిన తడక రమేష్ పాఠశాల అధికారులతో మాట్లాడి బస్సు షెల్టర్ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా 10ఐ20 అడుగుల కొలతలతో రేకుల షెడ్డు నిర్మించడంతో పాటు విద్యార్థులు కూర్చునేందుకు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి సొంత నిధులతో బస్సు షెల్టర్ నిర్మాణానికి ముందుకొచ్చిన తడక రమేష్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.



వైభవంగా మార్కండేయ స్వామి భజన మండలి స్వర్ణోత్సవాలు





ం జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

ం ధ్వజారోహణం, ద్వాదశ మెట్ల పూజల నిర్వహణ

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి: స్థానిక పురపాలక కేంద్రంలోని మార్కండేయ స్వామి దేవాలయంలో భజన మండలి స్వర్ణోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున స్వామివారి మేలుకొలుపు సేవతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. భజన మండలి అధ్యక్షుడు కొంగర బాల నరసింహ ఆధ్వర్యంలో నిర్వహించిన ధ్వజారోహణ ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు జ్యోతి ప్రజ్వలన చేసి బ్రహ్మోత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా ద్వాదశ మెట్ల పూజలు, వివిధ భజన మండలాలచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీశ్రీశ్రీ పరిశుద్ధానందగిరి (పరాశ్రరాశ్రమము) స్వామీజీ ఆధ్యాత్మిక ప్రవచనాలు గావించారు. భజన మండలి స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మార్కండేయ స్వామి యశస్సును చాటేలా స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు భజన మండలి అధ్యక్షుడు బాల నరసింహ తెలిపారు. ఈ కార్యక్రమంలో భజన మండలి ఉపాధ్యక్షుడు కూరపాటి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చెరుపల్లి భాస్కర్ పంతులు, కోశాధికారి ఈపూరి సత్యనారాయణ, సభ్యులు రుద్ర పాండురంగ శాస్త్రి, భోగ హరి శంకర్, తడక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'రాజన్ క్యాస్టిల్ ప్రాపర్టీస్' కార్యాలయం ప్రారంభం

ం హాజరైన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

ం వినియోగదారుల నమ్మకమే ప్రధానం

తొలివెలుగు, వనస్థలిపురం: చింతల్‌కుంట సమీపంలో కేఎల్ఎం షాపింగ్ మాల్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన 'రాజన్ క్యాస్టిల్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్' కార్యాలయాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రా ప్రారంభించారు. సంస్థ చైర్మన్ కట్టా భాగ్య రాజన్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ రంగంలో విశ్వసనీయత, పారదర్శకత, నాణ్యమైన సేవలకు ప్రాధాన్యత ఇస్తూ వినియోగదారుల నమ్మకాన్ని పొందాలని సూచించారు. సంస్థ చైర్మన్ భాగ్య రాజన్ గౌడ్ మాట్లాడుతూ.. నూతన కార్యాలయం ద్వారా తమ సేవలను విస్తరించి వినియోగదారులకు మరింత చేరువవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట పాలకమండలి సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్ గుప్త, మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి, గండి కోట శ్రీనాథ్, కూరెళ్ల వేములయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్పాలయంలో మండల దీక్షలకు సన్నాహాలు

ం డిసెంబరు 3 నుంచి ఏడో తేదీ వరకు వైభవంగా బ్రహ్మోత్సవాలు

ం దాతలు సహకరించాలని ట్రస్ట్ కమిటీ విజ్ఞప్తి

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి: స్థానిక పురపాలక కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈ నెల 16 నుంచి డిసెంబరు 27 వరకు మండల దీక్షలు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ గౌరవ చైర్మన్ అజిత్ వర్మ, చైర్మన్ రాపోలు జ్ఞానేశ్వర్ వెల్లడించారు. ఆదివారం వారు ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి దేవాలయాన్ని సందర్శించి, మండల దీక్షల కోసం చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. డిసెంబరు 3 నుంచి 7వ తేదీ వరకు అయ్యప్ప స్వామివారి బ్రహ్మోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కేరళకు చెందిన వేద పండితులు, తాంత్రిక నిపుణులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల




నిర్వహణకు దాతలు ఉదారంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపోలు రామచంద్రం, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఎన్.ఎమ్. శివకుమార్, కోశాధికారి చిలువేరు బాల నరసింహ, జిల్లా వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత రవాణాకు ఈ-వాహనాలే శ్రీరామరక్ష

ం చంపాపేట్‌లో 'మెర్క్యురీ ఈవీ టెక్' షోరూమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

తొలివెలుగు, చంపాపేట్: ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని విరాట్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'శ్రీ లక్ష్మీ గణేష్ మోటార్స్ -మెర్క్యురీ ఈవీ టెక్ లిమిటెడ్' షోరూమ్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ జయేష్ రక్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ-వాహనాల వినియోగం పెరగడం వల్ల వాయు కాలుష్యం తగ్గి పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందన్నారు. కాలుష్య రహిత రవాణా వ్యవస్థకు ఇవి ఎంతో కీలకమని, నిర్వాహకులు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ రాణించాలని ఆకాంక్షించారు. డి. శ్రీనివాస్ - రంగేశ్వరి ఆహ్వానం మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో వి.ఆర్.ఆర్. ఎంటర్‌ప్రైజెస్ హైదరాబాద్ మేనేజింగ్ పార్టనర్లతో పాటు పలువురు స్థానికులు, ఆహ్వానితులు పాల్గొన్నారు.









ఘనంగా మంత్రి వాకిటి శ్రీహరి జన్మదిన వేడుకలు

ం ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం

తొలివెలుగు, కృష్ణ: స్థానిక మండల కేంద్రంలో ఆదివారం రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ క్షీర లింగేశ్వర స్వామి ఆలయంలో మంత్రి పేరున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేడుకల్లో భాగంగా భక్తులు, పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీసీ, మైనార్టీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు, వార్డు సభ్యులు, యువజన విభాగం నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాగోల్‌లో ఇద్దరు చిన్నారులు అదృశ్యం

ం పనికి వెళ్లి ఇంటికి వచ్చేసరికి కనిపించని పిల్లలు

ం పోలీసులను ఆశ్రయించిన తల్లి.. కేసు నమోదు చేసి దర్యాప్తు



తొలివెలుగు, నాగోల్ : ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు అదృశ్యమైన ఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పిల్లలు కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన తల్లి పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్‌లోని సాయిరాంనగర్ కాలనీ, రోడ్ నంబర్ 3కు చెందిన మొగిలి శిరీష (28) తన ఇద్దరు కుమారులు వరుణ్ తేజ్ (8), మహేష్ (6)తో కలిసి నివసిస్తోంది. వరుణ్ తేజ్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి, మహేష్ రెండో తరగతి చదువుతున్నారు. అక్టోబర్ 31న ఉదయం తల్లి పనికి వెళ్లి రాత్రి 9.30 గంటలకు ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇద్దరు పిల్లలు కనిపించలేదు. దీంతో వారు పాఠశాలకు వెళ్లి ఉంటారని భావించి ఉపాధ్యాయులను విచారించగా, ఆ రోజు పాఠశాలకు రాలేదని తెలిసింది. దీంతో ఆందోళనకు గురైన శిరీష నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని ఇద్దరు చిన్నారుల ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

మిత్రమా నీ కుటుంబానికి మేమున్నాం

ం పాముకాటుతో చనిపోయిన మిత్రుడి కుటుంబానికి రూ.30 వేల సాయం

ం స్నేహ బంధాన్ని చాటుకున్న రామన్నపేట పూర్వ విద్యార్థులు



తొలివెలుగు, రామన్నపేట: పాముకాటుతో అకాల మరణం చెందిన మిత్రుని కుటుంబానికి ఆయన సహచర పూర్వ విద్యార్థులు ఉదారత చాటుకున్నారు. స్థానిక రామన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003-2004 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ.30,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన మెండే లింగస్వామి ఇటీవల పాముకాటుకు గురై మృతిచెందడంతో ఆయన కుటుంబం తీవ్ర ఆవేదనలో పడింది. తమతో పాటు చదువుకున్న మిత్రుడు మరణించాడని తెలుసుకున్న పూర్వ విద్యార్థులు మానవతా దృక్పథంతో స్పందించి, విరాళాలు సేకరించి ఆదివారం ఆయన కుటుంబానికి అందజేశారు. కష్టకాలంలో అండగా నిలిచిన మిత్రుల ఔదార్యాన్ని స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాపాన్ని సతీష్ కుమార్, కొమ్ము చంద్రశేఖర్, ముగ్గు నరసింహ, వావిళ్ల సంతోష్, మోటి గణేష్, పొగాకు శ్రీశైలం, శనకొండ ప్రవీణ్ కుమార్, వంగాల రవి, ఎస్.కె. సయ్యద్, జవాజి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ.. కుటుంబానికి రూ.50 వేల చేయూత

ం ఆసుపత్రిలో శ్రీనివాస్‌ను పరామర్శించిన కౌన్సిలర్లు



తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి: ఇటీవల జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జోగు శ్రీనివాస్‌ను ఆదివారం స్థానిక పురపాలక కౌన్సిలర్లు ఆసుపత్రిలో పరామర్శించారు. కౌన్సిలర్లు పెద్దల చక్రపాణి, శ్రీరామ మంజుల లింగస్వామి, జింకల లావణ్య యాదగిరిలు చికిత్స పొందుతున్న శ్రీనివాస్‌ను కలసి పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ఆరా తీశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ.50,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, నాయకుడు కూరపాటి బాబు తదితరులు పాల్గొన్నారు.




అర్హులందరూ పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవాలి

ం భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నూకల వెంకటనారాయణరెడ్డి

తొలివెలుగు, చిట్యాల : అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకుని, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నూకల వెంకటనారాయణరెడ్డి కోరారు. చిట్యాల మున్సిపాలిటీలోని 5వ వార్డులో ఆదివారం నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, నిర్లక్ష్యంతో అర్హులెవరూ ఓటును కోల్పోవద్దని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాజపా అభ్యర్థిని గెలిపించాలని కోరారు. పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ ఓటరు నమోదుపై అవగాహన పెంచాలన్నారు. ఓటరు నమోదు కోఆర్డినేటర్ ఈదుదుల మల్లేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాజపా మున్సిపల్ అధ్యక్షుడు గుండాల నరేష్ గౌడ్, కన్నెబోయిన మహాలింగం, కూరెళ్ల శ్రీనివాస్, పల్లె వెంకన్నగౌడ్, జయారపు రామకృష్ణ, గోశిక వెంకటేశం, కంచర్ల శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న కౌన్సిలర్ యాదమ్మ

ం పేదింటి ఆడబిడ్డ పెళ్లికి రూ. 10,116 ఆర్థిక సాయం ం చిట్యాల 3వ వార్డులో ఆదర్శం



తొలివెలుగు, చిట్యాల: ఎన్నికల సమయంలో వార్డు ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ చిట్యాల పురపాలక సంఘం 3వ వార్డు కౌన్సిలర్ గాలి యాదమ్మ లింగయ్య ఆదర్శంగా నిలిచారు. వార్డు పరిధిలోని నిరుపేద ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సాయం అందిస్తానన్న హామీ మేరకు ఆదివారం ఓ కుటుంబానికి పెళ్లి కానుకగా రూ. 10,116 నగదును అందించారు. 3వ వార్డుకు చెందిన బూరుగు యాదయ్య, వరమ్మ దంపతుల కుమార్తె పూజ వివాహం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ దంపతులు వివాహ వేడుకకు హాజరై నవదంపతులను ఆశీర్వదించడంతో పాటు, పెళ్లి కానుకగా రూ. 10,116 ఆర్థిక సాయాన్ని అందజేశారు. కష్టకాలంలో ఆడబిడ్డ పెళ్లికి కొండంత అండగా నిలిచిన కౌన్సిలర్‌ను స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు

ం హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు



తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి: స్థానిక పురపాలక కేంద్రంలో ఆదివారం మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు స్వీకరించారు. అనంతరం నాయకులు ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సామ రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బత్తుల మాధవి శ్రీశైలం గౌడ్, సీనియర్ నాయకులు పర్ని మల్లారెడ్డి, నోముల మాధవరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి గునిగంటి మల్లేష్ గౌడ్, సర్పంచులు శాపాక లింగస్వామి, కర్నాటి వరలక్ష్మి పాండు, ఆర్ల కావ్య వెంకటేష్, కౌన్సిలర్లు బాత్క లింగస్వామి యాదవ్, కర్నాటి వరలక్ష్మీ నరసింహ, ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బొమ్మగోని పరమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా చరిత్రకు శతకాలే సాక్ష్యం: ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

- ఘనంగా 'లక్ష్మీ శతకం' పుస్తకావిష్కరణ



తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి: తెలుగు భాషా చరిత్రలకు శతక సాహిత్యాన్నే ప్రధాన సాక్ష్యంగా చెప్పవచ్చని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. పోచంపల్లి పురపాలక కేంద్రంలోని టూరిజం పార్కులో ఆదివారం జాతీయ తెలుగు సాహిత్య పీఠం ఆధ్వర్యంలో ప్రముఖ కవి వడ్డేపల్లి రాజేశ్వర్ రచించిన 'లక్ష్మీ శతకం' పుస్తకావిష్కరణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కవితో కలసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య కసిరెడ్డి మాట్లాడుతూ.. కనుమరుగవుతున్న తెలుగు భాషా సాహిత్యాన్ని బతికించడంలో శతక కవుల పాత్ర విస్మరించలేనిదన్నారు. మారుతున్న ఆధునిక కాలంలో తెలుగు భాష, సంస్కృతులను భావితరాలకు సగర్వంగా అందించాల్సిన బాధ్యత నేటి కవులపై ఉందన్నారు. అనంతరం కవి వడ్డేపల్లి రాజేశ్వర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులు వెల్దండి సత్యనారాయణ, డాక్టర్ నలబోలు నరసింహారెడ్డి, శ్రీమతి రావూరి వనజ, టి.శ్రీలక్ష్మి, శాంతారెడ్డి, రావిరాల స్వామి, కందగట్ల స్వామి, శోభ, గడ్డం వెంకటేష్, కవిత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైఖరిపై బీజేపీ ఆగ్రహం

ం ఆరు గ్యారంటీలు, బునాదిగాని కాలువ సమస్యలు ఏమయ్యాయి?

ం ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం.. ఆత్మకూరు (ఎం)లో బీజేపీ నిరసన



తొలివెలుగు, ఆత్మకూరు (ఎం): స్థానిక ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ఢిల్లీలో ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడం ఏమిటని బీజేపీ మండల అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆదివారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆత్మకూరు (ఎం)లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ మండలంలోని ప్రధాన సమస్యగా ఉన్న బునాదిగాని కాలువ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులోనూ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. స్థానికంగా అనేక సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తుంటే వాటిని పక్కనపెట్టి ఢిల్లీలో నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడం సరికాదన్నారు. ముందుగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి, స్థానిక సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు రాంబాబు, బూత్ అధ్యక్షుడు యాస వెంకట్ రెడ్డి, నాయకులు యాస శ్రీనివాస్ రెడ్డి, గడ్డం స్వామి, యువమోర్చా మండల అధ్యక్షుడు భాషబోయిన లింగయ్య యాదవ్, నాతి సాయి శివ, పొన్నగాని సూర్య ప్రకాష్, బండారు సాయి తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎస్ అధికారి నరహరితో ఉపసర్పంచ్‌ల ఫోరం నేత మజ్జిగ నరేష్ భేటీ

ం గ్రామాల అభివృద్ధి, పంచాయతీల బలోపేతంపై చర్చ



తొలివెలుగు, ఆత్మకూర్ (ఎం): సీనియర్ ఐఏఎస్ అధికారి, పార్లమెంటరీ సెక్రటరీ పి.నరహరిని ఉపసర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజ్జిగ నరేష్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామాల సమగ్ర అభివృద్ధి, గ్రామపంచాయతీల బలోపేతం, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన తదితర ముఖ్యాంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ప్రజాప్రతినిధిగా గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన తక్షణ చర్యలు, ప్రజా సేవలో అనుసరించాల్సిన ఉత్తమ విధానాలపై ఐఏఎస్ అధికారి నరహరి నుంచి విలువైన సూచనలు, సలహాలు తీసుకున్నట్లు నరేష్ వెల్లడించారు. అనుభవజ్ఞులైన అధికారుల మార్గదర్శకత్వాన్ని పాటిస్తూ మండలంలోని గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) చిన్నగూడూరు మండల కమిటీ ఎన్నిక

ం అధ్యక్షుడిగా బోయిని నరేంద్ర, ప్రధాన కార్యదర్శిగా గండి ప్రవీణ్

ం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి: నరేంద్ర

తొలివెలుగు, చిన్నగూడూరు: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐజేయూ) చిన్నగూడూరు మండల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బోయిని నరేంద్ర ముదిరాజ్ (ఆంధ్రప్రభ), ప్రధాన కార్యదర్శిగా గండి ప్రవీణ్ (ఆంధ్రజ్యోతి), ఉపాధ్యక్షుడిగా గునిగంటి మహేష్ (తొలివార్త), కోశాధికారిగా దుంపల శ్రీనివాస్ (తొలివెలుగు) ఎన్నికయ్యారు. కమిటీ ముఖ్య సలహాదారులుగా భూపతి కాశయ్య గౌడ్, అనంతగిరి నాగయ్య, గౌరవ అధ్యక్షుడిగా గడిపెల్లి శ్రీనివాస్, కార్యదర్శులుగా మాచర్ల ఉపేందర్, శ్రీరాం సాంబయ్య, కార్యవర్గ సభ్యుడిగా గడిపెల్లి సందీప్‌లు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమానికి ఐజేయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గడిపెల్లి శ్రీహరి, జిల్లా ఉపాధ్యక్షుడు ఉమాగాని మధు హాజరై మాట్లాడారు. జర్నలిస్టుల ఐక్యతే సంఘానికి బలమని, సంక్షేమం, హక్కుల పరిరక్షణకు యూనియన్ నిరంతరం కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నరేంద్ర మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, హక్కుల పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.



సొంతింటి కల కల్లలైంది.. శ్రీ కన్స్ట్రక్షన్స్ బాధితుల ఆవేదన





ం రూ.100 కోట్ల ప్లాట్ల వ్యవహారంపై కుటుంబాలతో కలిసి ధర్నా

ం రెండో రోజూ కొనసాగిన నిరసన.. న్యాయం జరిగే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం

తొలివెలుగు, రాజాపేట: ప్లాట్లు కొనుగోలు చేసి సొంతింటి కల నెరవేర్చుకోవాలనుకున్న వారి ఆశలు ఆవిరయ్యాయని శ్రీ కన్స్ట్రక్షన్స్ వెంచర్ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాట్లు విక్రయించి సుమారు రూ.100 కోట్లు వసూలు చేశారని, ప్రస్తుతం తమకు న్యాయం జరగడం లేదని ఆరోపిస్తూ రాజాపేట మండలం చెల్లూరు గ్రామ పరిధిలోని వెంచర్ వద్ద ఆదివారం రెండో రోజు కూడా కుటుంబసభ్యులతో కలిసి ధర్నా నిర్వహించారు. చెల్లూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 322లో ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

600 ప్లాట్ల విక్రయం.. రూ.100 కోట్లు వసూలు చేశారని ఆరోపణ:

ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. 2019 జూన్ 19న శ్రీ కన్స్ట్రక్షన్స్ డెవలపర్స్ నిర్వాహకులు 70 ఎకరాల 22 గుంటల విస్తీర్ణంలో వెంచర్ ఏర్పాటు చేసి సుమారు 600 ప్లాట్లను విక్రయించారని తెలిపారు. ఈ క్రమంలో కొనుగోలుదారుల నుంచి దాదాపు రూ.100 కోట్లు వసూలు చేసినట్లు ఆరోపించారు. అనంతరం భాగస్వాముల మధ్య వివాదాలు తలెత్తడంతో డీటీసీపీ అధికారులు తనిఖీలు చేపట్టి ఈ ఏడాది జనవరి 24న 600 ప్లాట్ల అనుమతులను రద్దు చేసినట్లు బాధితులు పేర్కొన్నారు.

అప్పులు చేసి ప్లాట్లు కొన్నాం.. ఇప్పుడు దిక్కెవరు?

తమలో చాలామంది తాళిబొట్లు తాకట్టు పెట్టి, అప్పులు చేసి జీవితకాల కష్టార్జితంతో ప్లాట్లు కొనుగోలు చేశామని బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. ప్రస్తుతం వెంచర్ నిర్వాహకులు అందుబాటులో లేకపోగా, తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. జీవితకాల పొదుపుతో కొనుగోలు చేసిన ప్లాట్ల విషయంలో అనిశ్చితి నెలకొనడంతో కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయని తెలిపారు.

న్యాయం జరిగే వరకు పోరాటం:

తమకు న్యాయం జరిగే వరకు ధర్నాను విరమించేది లేదని బాధితులు స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి ప్లాట్ల కొనుగోలుదారులకు న్యాయం చేయాలని, తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు.





ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ ట్విస్ట్..
హరీశ్‌రావుపై మరిన్ని సెక్షన్లతో కొత్త ఎఫ్ఐఆర్

- హరీశ్‌ను ఏ1గా, మాజీ డీసీపీ రాధాకిషన్‌రావును ఏ2గా చేర్చిన పోలీసులు
- హైకోర్టు ఆదేశాలతో పంజాగుట్ట నుంచి సిద్దిపేటకు కేసు బదిలీ
- పాత ఎఫ్ఐఆర్ కంటే అదనంగా పలు సెక్షన్ల కింద కేసు నమోదు

ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల నేపథ్యంలో బీఆర్ఎస్ సీనియర్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే టి. హరీశ్‌రావుపై సిద్దిపేట పోలీసులు తాజాగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో హరీశ్‌రావును మొదటి నిందితుడుగా (ఏ1), టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావును రెండో నిందితుడిగా (ఏ2) చేర్చారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును పంజాగుట్ట పోలీస్ స్టేషన్ నుంచి సిద్దిపేటకు బదిలీ చేసి, ఇక్కడ కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం గమనార్హం. సిద్దిపేటకు చెందిన వ్యాపారవేత్త చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదైంది. మరణించిన రైతుల కుటుంబాలకు తాను ఆర్థిక సాయం అందిస్తుండటంతో, తన పట్ల పెరుగుతున్న ప్రజాదరణను చూసి హరీశ్‌రావు కక్ష పెంచుకున్నారని చక్రధర్ గౌడ్ ఆరోపించారు. మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు ద్వారా తనను బెదిరించి, అక్రమ కేసుల్లో ఇరికించేందుకు కుట్ర పన్నారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనతో పాటు తన భార్య ఫోన్లను కూడా ట్యాప్ చేశారని, ఈ విషయాన్ని యాపిల్ సంస్థ పంపిన హెచ్చరిక సందేశాలు ద్వారా గుర్తించానని ఆయన వివరించారు. ఈ వ్యవహారంపై చక్రధర్ గౌడ్ తొలుత 2024 డిసెంబర్ 1న పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసు విచారణ క్రమంలో సుప్రీంకోర్టు వరకు వెళ్లగా, అనంతరం కేసును సిద్దిపేటకు బదిలీ చేసి కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాల మేరకు సిద్దిపేట పోలీసులు పాత ఎఫ్ఐఆర్‌లోని అంశాలతో పాటు మరిన్ని అదనపు సెక్షన్లను ఈ కేసులో చేర్చారు. ఐపీసీ సెక్షన్లు 120బీ, 386, 409, 506, 419, 420, 467, 406 రెడ్ విత్ 34తో పాటు ఐటీ చట్టంలోని సెక్షన్ 66డీ కింద హరీశ్‌రావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పులివెందులలో ఈ పరిస్థితికి జగనే కారణం: నారా లోకేశ్

- పులివెందులలో ఉద్రిక్తతలకు జగనే కారణమన్న మంత్రి లోకేశ్
- గం తంలో ఏకగ్రీవాలు చేసి ఇప్పుడు ప్రజాస్వామ్యంపై నీతులు చెబుతున్నారని విమర్శ
- ప్రజాప్రభుత్వంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తున్నామని స్పష్టీకరణ
- బెంగళూరు నుంచి వచ్చి గొడవలు సృష్టించి తిరిగి వెళ్లిపోయారని ఆరోపణ
- రాష్ట్రమంతా ప్రశాంతంగా ఉంటే పులివెందులలోనే సమస్యలెందుకని ప్రశ్న



పులివెందులలో ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులకు, శాంతిభద్రతల సమస్యకు జగనే పూర్తి కారణమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆరోపించారు. ప్రజాప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్యయుతంగా నిర్వహిస్తుంటే, జగన్ ఓటమి భయంతో స్వయంగా పులివెందులకు వచ్చి అశాంతిని సృష్టిస్తున్నారని ఆయన విమర్శించారు. బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాప్తాడు బాలికను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పులివెందులలో ప్రతి వార్డునూ ఏకగ్రీవం చేసిన జగన్ రెడ్డి, ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని లోకేశ్ ఎద్దేవా చేశారు. “గత ఎన్నికల్లో పులివెందులలో ఒక్కరైనా నామినేషన్ వేయగలిగారా? కనీసం పోటీ చేసే ధైర్యం ఎవరికైనా ఉండేదా? అని ప్రజలు ప్రశ్నించాలి. ఆనాడు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, ఇప్పుడు మేం స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహిస్తుంటే నీతులు చెబుతున్నారు. మా ప్రభుత్వంలో అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్ వేసేందుకు పోలీసు భద్రత కల్పించాం. అందుకే పులివెందులలో కూడా నామినేషన్లు దాఖలయ్యాయి. ఇది ఓర్వలేకే జగన్ స్వయంగా రంగంలోకి దిగారు” అని లోకేశ్ అన్నారు. పులివెందులలో వ్యూహాత్మకంగా అల్లర్లు సృష్టిస్తున్నారని లోకేశ్ ఆరోపించారు. “ఆదివారం మధ్యాహ్నం బెంగళూరు నుంచి ప్రత్యేకంగా పులివెందులకు వచ్చి సమస్యలు సృష్టించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలను రెచ్చగొట్టి, వాహనాలను తగులబెట్టించి, ఆ నిందను మా ప్రభుత్వంపై వేస్తున్నారు. గొడవలు సృష్టించిన వెంటనే హెలికాప్టర్‌లో తిరిగి బెంగళూరు వెళ్లిపోయి, జాతీయ మీడియాను పిలిచి తామే బాధితులమని నాటకాలాడుతున్నారు” అని లోకేశ్ విమర్శించారు. రాష్ట్రంలో ఇచ్ఛాపురం నుంచి కుప్పం వరకు స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయని, ఇటీవల విశాఖ, కడప నగరాల్లో కూడా ఎలాంటి సమస్య తలెత్తలేదని లోకేశ్ గుర్తుచేశారు. “అలాంటప్పుడు కేవలం పులివెందులలోనే ఎందుకు సమస్యలు వస్తున్నాయి? దీనికి జగన్ రెడ్డి వైఖరే ఏకైక కారణం. తన కంచుకోటలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయడానికి ముందుకు రావడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారు” అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై తమకు, తమ ప్రభుత్వానికి పూర్తి విశ్వాసం ఉందని, ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేస్తామని లోకేశ్ స్పష్టం చేశారు. పులివెందులలో చోటుచేసుకుంటున్న ప్రతి ఘటన వెనుక జగన్ రెడ్డి ప్రమేయం ఉందని ఆయన పునరుద్ఘాటించారు.

చౌటుప్పల్‌లో జోగిని దారుణ హత్య.. 130 తులాల బంగారం, 2.5 కిలోల వెండి అపహరణ

- నమ్మకంగా ఉంటూనే హత్య చేసిన ఇద్దరు అస్సాం శిష్యులు
- హత్య అనంతరం సొమ్ములతో కారులో పరారీ
- కారు జీపీఎస్ సిగ్నల్స్ ఆధారంగా నిందితులను పట్టుకున్న పోలీసులు
- దోపిడీ కోసమే హత్య జరిగిందని ప్రాథమిక నిర్ధారణ

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో సంచలనం సృష్టించిన జోగిని హత్య కేసును పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించారు. జోగిని రాళ్లబండ సుధాకర్‌ను హత్య చేసి, భారీగా నగదు, బంగారం దోచుకెళ్లిన ఇద్దరు శిష్యులను అదుపులోకి తీసుకున్నారు. మృతుడి కారులో పారిపోతున్న నిందితులను జీపీఎస్ సిగ్నల్స్ ఆధారంగా పట్టుకోవడం గమనార్హం. సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాకకు చెందిన రాళ్లబండ సుధాకర్ (50) కొంతకాలంగా చౌటుప్పల్‌లో నివసిస్తూ జోగినిగా, పండుగల పూజారిగా పేరుగాంచారు. ఈ క్రమంలో ఆయన ఆర్థికంగా బాగా స్థిరపడ్డారు. ఏటా అస్సాంలోని కామాఖ్య ఆలయానికి వెళ్లే సుధాకర్‌కు అక్కడే పవన్, హర్ష అనే ఇద్దరు యువకులతో పరిచయం ఏర్పడింది. మూడు రోజుల క్రితమే వారు ఆయన వద్ద శిష్యులుగా



చేరి ఇంట్లోనే ఉంటున్నారు. శనివారం అర్ధరాత్రి సుధాకర్‌పై దాడి చేసిన నిందితులు.. కాళ్లు, చేతులు కట్టేసి, కళ్లలో పెప్పర్ స్ప్రే చల్లి, గొంతు నులిమి కిరాతకంగా హత్య చేశారు. అనంతరం ఇంట్లోని బీరువాలో ఉన్న సుమారు 130 తులాల బంగారం, 2.5 కిలోల వెండి, రూ. 10 లక్షల నగదును దోచుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.3 కోట్ల వరకు ఉంటుందని అంచనా. సాక్ష్యాలు దొరక్కుండా సీసీటీవీ హార్డ్ డిస్క్‌ను కూడా తమ వెంట తీసుకెళ్లారు. పక్క ఇంట్లో ఉండే సుధాకర్ దత్తపుత్రుడు సురేష్, ఘటనను గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన చౌటుప్పల్ సీఐ సతీశ్‌రెడ్డి బృందం, నిందితుల సెల్‌ఫోన్ సిగ్నల్స్, కారు జీపీఎస్ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేసింది. నిందితులు పెద్ద అంబర్‌పేట్ ఓఆర్ఆర్ టోల్‌గేట్ దాటినట్లు గుర్తించి, జీపీఎస్ సాయంతో వారి కారును సిద్దిపేట సమీపంలో అడ్డగించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఘటనాస్థలిని పరిశీలించి, విచారణను పర్యవేక్షించారు. నమ్మిన శిష్యులే ఈ ఘాతుకానికి పాల్పడ్డారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం నిందితులను విచారిస్తున్న పోలీసులు.. దోపిడీ కోసమే హత్య జరిగిందా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవాల్సి ఉంది.

హైదరాబాద్‌లో అండాల దందా గుట్టురట్టు.. 43 మంది మహిళలకు విముక్తి

- హైదరాబాద్‌లో అంతర్రాష్ట్ర అండాల సేకరణ రాకెట్ బట్టబయలు
- నిందితుల చెర నుంచి 43 మంది మహిళలకు విముక్తి కల్పించిన పోలీసులు
- ప్రధాన నిర్వాహకులతో సహా మొత్తం 9 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు
- ఐవీఎఫ్, ఫెర్టిలిటీ సెంటర్లతో సంబంధాలపై లోతుగా దర్యాప్తు
- నకిలీ ఆధార్ కార్డులు, పత్రాలు సృష్టించి మోసాలకు పాల్పడినట్లు అనుమానం



హైదరాబాద్ నగరంలో భారీ ఎత్తున సాగుతున్న అంతర్రాష్ట్ర అండాల అక్రమ సేకరణ రాకెట్‌ను పోలీసులు ఛేదించారు. పేద మహిళలను లక్ష్యంగా చేసుకుని, వారి నుంచి అండాలను సేకరించి ఐవీఎఫ్, ఫెర్టిలిటీ సెంటర్లకు అమ్ముకుంటున్న ముఠాను అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 43 మంది మహిళలకు విముక్తి కల్పించారు. ముఠాకు చెందిన 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. బేగంపేట్, సరూర్‌నగర్ పోలీసులు, మల్కాజ్‌గిరి స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ సంయుక్తంగా ఈ దాడులు నిర్వహించారు. ప్రకాశ్ నగర్, బేగంపేట్, ఎర్రగడ్డ, సరూర్‌నగర్, గోపాలపురం ప్రాంతాల్లోని పలు చోట్ల ఏకకాలంలో సోదాలు చేపట్టారు. పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి పేద మహిళలను ఏజెంట్లు లక్ష్యంగా చేసుకుంటున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఒక్కో అండం సేకరణకు రూ.20,000 నుంచి రూ.30,000 వరకు ఇస్తామని ఆశ చూపి వారిని హైదరాబాద్‌కు రప్పిస్తున్నారు. ఇక్కడ అద్దె ఇళ్లలో ఉంచి, ఫెర్టిలిటీ సెంటర్లకు అనుసంధానం చేస్తున్నారు. అండాల సేకరణ కోసం మహిళలకు బలవంతంగా హార్మోన్ల ఇంజెక్షన్లు, మందులు ఇస్తున్నట్లు బాధితులు పోలీసులకు తెలిపారు. దాడుల సమయంలో పోలీసులు హార్మోన్ల ఇంజెక్షన్లు, సిరంజిలు, మాత్రలతో పాటు కీలకమైన పత్రాలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ రాకెట్ ప్రధాన నిర్వాహకుడిగా అమిత్ శర్మ (44), మహిళలను రిక్రూట్ చేసే సహ నిర్వాహకురాలిగా నిక్కత్ పర్వీన్ (31)తో పాటు ఏజెంట్లు, ఏఆర్‌టీ బ్యాంక్ మేనేజర్ సహా మొత్తం తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు అమిత్ శర్మ ప్రకాశ్ నగర్‌లో రూ.50,000 అద్దె చెల్లిస్తూ రెండేళ్లుగా ఈ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు గుర్తించారు. మహిళల పేరుతో నకిలీ ఆధార్ కార్డులు, అఫిడవిట్లు, అంగీకార పత్రాలు సృష్టించి ఈ దందా నడుపుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ రాకెట్ వెనుక ఉన్న ఐవీఎఫ్ సెంటర్లు, ఏఆర్‌టీ బ్యాంకుల పాత్రపై కూడా లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై బేగంపేట్, సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్లలో మొత్తం మూడు కేసులు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ) రెగ్యులేషన్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ జరిగింది.

ఈసారి మాపై దాడి చేస్తే, ప్రపంచంలో ఎక్కడైనా ప్రతిదాడి చేస్తాం

- అమెరికా, ఇజ్రాయెల్ దాడులపై ఇరాన్ స్పందన
- భౌగోళిక పరిమితులు లేకుండా బదులిస్తామన్న సుప్రీం లీడర్ ఖొమైనీ
- సర్వసన్నద్ధంగా ఉండాలని సైనిక దళాలకు ఆదేశాలు
- ఒకవైపు దౌత్య చర్చలు, మరోవైపు యుద్ధ హెచ్చరికలతో ఉద్రిక్తత
- ఇరాన్ అణు కేంద్రాలపై దాడి చేయగలమన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్

అంతర్జాతీయ ఉద్రిక్తతల నడుమ ఇరాన్ సంచలన హెచ్చరికలు జారీ చేసింది. తమ దేశంపై అమెరికా లేదా ఇజ్రాయెల్ మళ్లీ దాడికి పాల్పడితే, ఎలాంటి భౌగోళిక పరిమితులు లేకుండా తక్షణమే, శక్తిమంతంగా బదులిస్తామని స్పష్టం చేసింది. ప్రపంచంలో ఎక్కడైనా దాడి చేస్తామని హెచ్చరించింది. ఈ మేరకు సర్వసన్నద్ధంగా ఉండాలని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ దేశ సాయుధ దళాలను ఆదేశించారు. ప్రస్తుత వివాదం మొదలైన తర్వాత తొలిసారిగా దేశంలోని ముగ్గురు ఉన్నత సైనిక కమాండర్లతో మొజ్తబా ఖమేనీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. “శత్రువులు మళ్లీ సైనిక లేదా ఉగ్రవాద దాడులకు దిగితే, ఆ ఘర్షణలు ఎప్పుడు, ఎలాంటి పరిస్థితుల్లో ముగుస్తాయో ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ సైన్యం, ఇరాన్ ప్రజలే నిర్ణయిస్తారు” అని మొజ్తబా స్పష్టం చేసినట్లు ఆయన కార్యాలయం వెల్లడించింది. “శత్రు దేశాల భౌతిక, అభౌతిక ఆస్తులన్నింటినీ లక్ష్యం చేసుకునేలా టార్గెట్ డేటాబేస్‌ను నవీకరించాలని సూచించారు. ఈ సమావేశంలో సైనిక కమాండర్లు కూడా తమ సంసిద్ధతను ఖమేనీకి వివరించారు. పర్షియన్ గల్ఫ్ తీరం, హర్మూజ్ జలసంధి, ఒమన్ గల్ఫ్ సహా దేశ సరిహద్దుల వద్ద గరిష్ఠ స్థాయిలో అప్రమత్తంగా ఉన్నామని తెలిపారు. ఆయుధాలు, నిఘా పరికరాలు, మందుగుండు సామగ్రి ఉత్పత్తిని గణనీయంగా పెంచినట్లు నివేదించారు. సైనిక నిఘాను బలోపేతం చేయడం, స్వదేశీ రక్షణ సామర్థ్యాలను విస్తరించడంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. మరోవైపు, ఇరాన్ ఉన్నత భద్రతా అధికారి మొహసెన్ రెజాయ్ మాట్లాడుతూ.. తమపై దాడి జరిగితే విధ్వంసకరంగా దెబ్బతీస్తామని, కొత్త ఆయుధాలను ఉపయోగిస్తామని హెచ్చరించారు. అయితే, అమెరికా తమ ఏడు షరతులకు అంగీకరిస్తే దౌత్యానికి ఇంకా అవకాశం ఉందని తెలిపారు. ఆంక్షల ఎత్తివేత, అమెరికా సైనిక ఉనికిని తగ్గించడం, స్తంభింపజేసిన ఆస్తుల



విడుదల, చమురు మినహాయింపుల పునరుద్ధరణ వంటివి ఈ షరతులలో ఉన్నాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలోనే తెరవెనుక దౌత్యపరమైన చర్చలు కూడా కొనసాగుతున్నాయి. అయితే చర్చలు బాగానే సాగుతున్నప్పటికీ, ఇరాన్ “అంత నమ్మదగినది కాదు” అని, అవసరమైతే వారి అణు కేంద్రాలపై దాడి చేసే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించడం ఉద్రిక్తతలను మరింత పెంచుతోంది.



భూగర్భంలో దాక్కున్నా బయటకు లాగుతాం.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు ఖర్గే హెచ్చరిక

జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ఖర్గే డిమాండ్

ఢిల్లీలో ఇండియా కూటమి 'ఢిల్లీ చలో' ర్యాలీ

మోదీ, అమిత్ షాపై ఖర్గే ఆరోపణలు

ఓట్ల చోరీతో ప్రభుత్వాలు ఏర్పడ్డాయని విమర్శ

ఈడీ, సీబీఐలకు భయపడబోమని స్పష్టీకరణ

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన భూగర్భంలో దాక్కున్నా బయటకు తీసుకొస్తామని వ్యాఖ్యానించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయంటూ సీఈసీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి నిర్వహించిన 'ఢిల్లీ చలో' ర్యాలీలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సభ చరిత్రాత్మకమని అభివర్ణించిన ఖర్గే.. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై ఆరోపణలు గుప్పించారు. యువత, మహిళలు, మైనారిటీల ఓటు హక్కులను హరించేందుకు వారు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు ప్రధాని, హోంమంత్రి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు, పోలీసులకు తాము భయపడబోమని చెప్పారు. ఈడీ, సీబీఐ వంటి సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాలను అణచివేయలేరని అన్నారు. మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఓట్ల చోరీతోనే అధికారంలోకి వచ్చాయని ఖర్గే ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే మోదీని అధికారంలో నుంచి తొలగించాలని పిలుపునిచ్చారు. 'మోదీని తొలగించండి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అని నినదించారు. మరోవైపు కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కూడా ఈ ర్యాలీపై స్పందించారు. ఇది ఏ ఒక్క పార్టీకి సంబంధించిన ఆందోళన కాదని, ప్రజల రాజ్యాంగ హక్కులను కాపాడేందుకేనని చెప్పారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించడం ఆమోదయోగ్యం కాదని ఆయన విమర్శించారు. ఎన్నికల జాబితా పూర్తిగా పారదర్శకంగా ఉండాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ రంగంలో మొదటిసారి.. గువహటిలో ప్రోటాన్ క్యాన్సర్ ట్రీట్‌మెంట్

గువహటిలో దేశంలోనే తొలి ప్రభుత్వ ప్రోటాన్ థెరపీ సెంటర్ ఏర్పాటు

రూ.600 కోట్లతో నిర్మాణానికి బెల్జియం సంస్థతో అసోం ప్రభుత్వ ఒప్పందం

ఈశాన్య రాష్ట్రాల క్యాన్సర్ రోగులకు అందుబాటులోకి అత్యాధునిక వైద్యం

మూడేళ్లలో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని లక్ష్యం

క్యాన్సర్ చికిత్స రంగంలో ఈశాన్య భారతదేశం ఒక చారిత్రక ముందడుగు వేసింది. దేశంలోనే మొట్టమొదటి ప్రభుత్వ రంగ ప్రోటాన్ బీమ్ థెరపీ కేంద్రాన్ని గువహటిలో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం అసోం ప్రభుత్వం, బెల్జియంకు చెందిన అయాన్ బీమ్ అప్లికేషన్స్ (xడీూ) సంస్థతో రూ.600 కోట్ల విలువైన ఒప్పందం కుదుర్చుకుంది. గౌహతి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ (+వీజఽ) ప్రాంగణంలో ఈ అత్యాధునిక కేంద్రాన్ని రాబోయే మూడేళ్లలో ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. శనివారం గువహటిలోని లోక్ సేవా భవన్‌లో అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ ప్రాజెక్టు వల్ల అసోంతో పాటు పొరుగున ఉన్న ఈశాన్య రాష్ట్రాల్లోని క్యాన్సర్ రోగులకు అత్యాధునిక, కచ్చితమైన రేడియేషన్ చికిత్స అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం ప్రైవేటు ఆసుపత్రుల్లో మాత్రమే అందుబాటులో ఉన్న ఈ చికిత్సకు సుమారు రూ.50 లక్షల వరకు ఖర్చవుతోంది. ఈ పరిస్థితిని మార్చాలనే లక్ష్యంతోనే ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు సీఎం హిమంత బిశ్వ శర్మ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. ప్రోటాన్ థెరపీ అనేది ఒక అధునాతన రేడియేషన్ చికిత్స. ఇది సాధారణ ఎక్స్-రేలకు బదులుగా ప్రోటాన్ కణాలను ఉపయోగించి, చుట్టూ ఉన్న ఆరోగ్యకరమైన కణజాలానికి హాని కలగకుండా నేరుగా క్యాన్సర్ కణితులపై దాడి చేస్తుంది. ముఖ్యంగా మెదడు, వెన్నెముక వంటి సున్నితమైన అవయవాల దగ్గర ఉన్న కణితులకు, చిన్న పిల్లలలో వచ్చే కొన్ని రకాల క్యాన్సర్లకు ఈ చికిత్స ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ ప్రాజెక్టుకు మొత్తం రూ.600 కోట్లు ఖర్చవుతుందని అంచనా కాగా, ఇందులో ప్రపంచ బ్యాంకు నుంచి రూ.315 కోట్లు, అసోం ప్రభుత్వం నుంచి రూ.285 కోట్లు సమకూరుస్తారు. ఒప్పందంలో భాగంగా xడీూ సంస్థ వైద్యులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తుంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 17 క్యాన్సర్ ఆసుపత్రులను అభివృద్ధి చేస్తున్నామని, వాటిలో 12 ఇప్పటికే పనిచేస్తున్నాయని సీఎం తెలిపారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే, అసోం ప్రాంతీయంగా క్యాన్సర్ చికిత్సకు ఒక ప్రధాన కేంద్రంగా మారుతుందని ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేసింది.



మూడున్నర దశాబ్దాలుగా శాఖాహార విందుకే ప్రాధాన్యం!

ం పెళ్లిళ్లలో మాంసాహారానికి దూరం.. పెద్దల నిర్ణయానికి కట్టుబాటు

ం రఘునాథపురం పద్మశాలీల ప్రత్యేక సంప్రదాయం

తొలివెలుగు, రాజాపేట: పండితుల వేదమంత్రోచ్ఛరణలు.. ఏడు అడుగుల నడక.. మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యే వివాహ వేడుకల్లో విందు భోజనానికి ప్రత్యేక స్థానం ఉంటుంది. సాధారణంగా పెళ్లిళ్లలో అతిథుల అభిరుచులకు అనుగుణంగా వివిధ రకాల వంటకాలు వడ్డిస్తుంటారు. అయితే రాజాపేట మండలం రఘునాథపురం గ్రామ పద్మశాలీలు మాత్రం ఇందుకు భిన్నంగా మూడున్నర దశాబ్దాలుగా పెళ్లి విందులో శాఖాహారానికే ప్రాధాన్యమిస్తూ ప్రత్యేక సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. గ్రామంలో పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన 700కు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరిలో ఏ కుటుంబంలో వివాహం జరిగినా పేద, ధనిక అనే తేడా లేకుండా అతిథులకు శాఖాహార భోజనమే వడ్డించడం ఆనవాయితీగా వస్తోంది. సుమారు 35 ఏళ్ల క్రితం గ్రామ పెద్దలు తీసుకున్న నిర్ణయాన్ని నేటికీ ప్రతి కుటుంబం గౌరవిస్తూ ఆచరిస్తోంది.



తరాలు మారినా మారని సంప్రదాయం:

కాలానుగుణంగా ఆహారపు అలవాట్లు, వివాహ వేడుకల నిర్వహణలో ఎన్నో మార్పులు వస్తున్నా రఘునాథపురం పద్మశాలీలు మాత్రం పెద్దలు నిర్ణయించిన సంప్రదాయానికి కట్టుబడి ఉంటున్నారు. కుటుంబ ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఒకే ఆచారాన్ని పాటించడం విశేషం. పెద్దల మాటకు గౌరవం ఇస్తూ మూడు దశాబ్దాలకు పైగా ఈ సంప్రదాయాన్ని కొనసాగించడం గ్రామ ఐక్యతకు, సంస్కృతి సంప్రదాయాల పట్ల వారికున్న నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఆధునిక కాలంలోనూ తరతరాలుగా వస్తున్న ఆచారాలను కాపాడుకోవచ్చని రఘునాథపురం పద్మశాలీలు చాటిచెబుతున్నారు.

పండ్లు తినడంలో ఈ చిన్న మార్పులు చేసుకోండి.. పోషకాలు పుష్కలం!

పండ్లు ఆరోగ్యానికి మంచివని తెలుసు. అందుకే చాలామంది రోజూ ఏదో ఒక పండు తింటుంటారు. మరికొందరు పండ్లతో జ్యూస్ చేసుకుని తాగుతారు. అయితే పండ్లలోని పూర్తి పోషకాలు అందాలంటే వాటిని తినే పద్ధతిలోనూ కొన్ని జాగ్రత్తలు అవసరమని పోషకాహార నిపుణురాలు నమామి అగర్వాల్ ఎన్డీటీవీ కథనంలో సూచించారు. రోజువారీ ఆహారంలో మూడు రకాల పండ్లను చేర్చుకోవడంతో పాటు, జ్యూస్‌కు బదులుగా నేరుగా పండ్లను తినాలని చెబుతున్నారు.



రోజూ పండ్లు తినాలి

యాపిల్, అరటిపండు, నారింజ, బొప్పాయి, జామ వంటి పండ్లలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు, పీచు పదార్థాలు ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. తీపి తినాలనే కోరిక కలిగినప్పుడు ప్యాకెట్ స్నాక్స్, చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలకు బదులుగా పండ్లను తీసుకోవడం మంచిదని నిపుణురాలు సూచిస్తున్నారు.

భోజనాల మధ్య తీసుకుంటే మంచిది

పండ్లను ప్రధాన భోజనంతో కలిపి తినడం కంటే మధ్యాహ్నం లేదా ఉదయం అల్పాహార సమయాల్లో తీసుకోవాలని సూచిస్తున్నారు. వ్యాయామానికి ముందు కూడా పండ్లు తినవచ్చు. వీటిలో ఉండే సహజ చక్కెర శరీరానికి వేగంగా శక్తిని అందిస్తుంది.

రోజూ 3 రకాల పండ్లు

ఒకే రకం పండుకు పరిమితం కాకుండా రోజూ మూడు రకాల పండ్లను ఆహారంలో చేర్చుకోవాలి. ఒక్కో పండులో ఒక్కో రకమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. అరటి, యాపిల్, నారింజ, బొప్పాయి, జామ వంటి పండ్లను మార్చి మార్చి తీసుకోవడం ద్వారా వివిధ పోషకాలు అందుతాయి.

జ్యూస్ వద్దు.. పండ్లనే తినండి

పండ్లను జ్యూస్‌గా చేసుకుని తాగడం కంటే నేరుగా తినడమే మంచిదని నిపుణులు చెబుతున్నారు. జ్యూస్ తయారీలో గుజ్జును తొలగిస్తే పీచు పదార్థాలు తగ్గిపోతాయి. అదే పండును పూర్తిగా తింటే ఫైబర్ అందుతుంది. ఇది జీర్ణక్రియకు తోడ్పడటంతో పాటు కడుపు నిండిన భావనను ఎక్కువసేపు ఉంచుతుంది.

మున్సిపల్ పోలింగ్ చాలావరకు ప్రశాంతం.. నివేదికల తర్వాతే రీపోలింగ్‌పై నిర్ణయం: ఎస్ఈసీ పునేఠా

ం రాష్ట్రంలో ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్

ం ఎస్ఈసీ అనిల్ పునేఠా ప్రెస్ మీట్

ం పల్నాడు, అనంతపురం జిల్లాల్లో కొన్ని ఘటనలు జరిగాయని వెల్లడి

ం విజయవాడలో పోలింగ్ ఆలస్యం కావడంతో సమయం పొడిగింపు

ం అధికారుల నుంచి నివేదికలు వస్తేనే చర్యలుంటాయని స్పష్టం చేసిన పునేఠా

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ స్వల్ప ఘటనలు మినహా చాలావరకు ప్రశాంతంగా ముగిసిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ కుమార్ పునేఠా వెల్లడించారు. పల్నాడు, అనంతపురం జిల్లాల్లో కొన్ని హింసాత్మక ఘటనలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటిపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీల నుంచి నివేదికలు అందిన తర్వాత రీపోలింగ్‌పై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. మధ్యాహ్నం 3 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 48.03 శాతం పోలింగ్ నమోదైందని ఆయన తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పోలింగ్ సరళిని వివరించారు. పోలింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించామని, ఉదయం నుంచి శ్రీకాకుళం, పల్నాడు, కడప సహా పలు జిల్లాల నుంచి వివిధ పార్టీల ప్రతినిధులు వచ్చి ఫిర్యాదులు అందజేశారని పునేఠా తెలిపారు. "ఉదయం 13,500 కెమెరాల ద్వారా వెబ్ కాస్టింగ్ పర్యవేక్షించాం. ప్రత్యేకించి పల్నాడు, అనంతపురం జిల్లాల్లో హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందాయి. లా అండ్ ఆర్డర్‌కు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని మూడు రోజుల క్రితమే కలెక్టర్లు, ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. ప్రశాంత వాతావరణం ఉంటేనే ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకుంటారు" అని ఆయన అన్నారు. మీడియా సమావేశానికి ముందు తాను నంద్యాల, కడప, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అనంతపురం, కర్నూలు, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించినట్లు చెప్పారు. చాలా జిల్లాల్లో ఎలాంటి హింస జరగలేదని కలెక్టర్లు నివేదించినట్లు తెలిపారు. విజయవాడలోని 55వ వార్డులో సాంకేతిక కారణాల వల్ల పోలింగ్ రెండున్నర గంటలు ఆలస్యంగా ప్రారంభమైందని, దీంతో జిల్లా కలెక్టర్ అభ్యర్థన మేరకు అక్కడ పోలింగ్ సమయాన్ని సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు పొడిగించినట్లు పునేఠా వెల్లడించారు. ఓటర్లకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్‌కు ఉన్న అధికారాలను ఉపయోగించి ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పల్నాడు, అనంతపురం జిల్లాల్లో జరిగిన ఘటనలపై పోలింగ్ సిబ్బంది సాయంత్రం రిసెప్షన్ సెంటర్లకు చేరుకున్నాక, ప్రిసైడింగ్ అధికారుల (పీవో) నుంచి లిఖితపూర్వక నివేదికలు తీసుకుంటామని ఎస్ఈసీ స్పష్టం చేశారు. "నివేదికలు, వెబ్ కాస్టింగ్ ఫుటేజీని పరిశీలించి, ఫిర్యాదుల్లో వాస్తవం ఉందని తేలితే తక్షణమే రీపోలింగ్‌పై ఆదేశాలు జారీ చేస్తాం. రేపు రీపోలింగ్ నిర్వహించి, ఎల్లుండి కౌంటింగ్ చేపట్టాల్సి ఉన్నందున ఈరోజే నిర్ణయం ఉంటుంది. కేవలం ఆరోపణలు, ఫిర్యాదుల ఆధారంగా




ఆదేశాలివ్వలేను. నేను ఇచ్చే ప్రతి ఉత్తర్వు న్యాయసమీక్షకు లోబడి ఉంటుంది. కలెక్టర్, ఎస్పీ నుంచి ఆధారం వస్తే వెంటనే చర్యలు తీసుకుంటాను," అని పునేఠా వివరించారు. గతంలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్న అన్నమయ్య జిల్లాలో ఈసారి పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, మదనపల్లెలో కేవలం మూడు చిన్న ఫిర్యాదులు మాత్రమే వచ్చాయని కలెక్టర్ తెలిపినట్లు చెప్పారు. పులివెందులలో జరిగిన ఒక ఘటనపై నివేదిక అందాల్సి ఉందన్నారు. 70 చోట్ల వైసీపీ ఏజెంట్లు లేరన్న ఫిర్యాదుపై వెంటనే స్పందించి, వారికి పోలీస్ ఎస్కార్ట్ ఏర్పాటు చేయాలని ఎస్పీని ఆదేశించినట్లు తెలిపారు. తాను నిష్పక్షపాతంగా, నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తున్నానని, టీడీపీ, వైసీపీ రెండు పార్టీలూ తనపై ఫిర్యాదులు చేస్తున్నాయంటే తాను ఎవరికీ కొమ్ము కాయడం లేదని అర్థమని పునేఠా వ్యాఖ్యానించారు. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 63.8 శాతం పోలింగ్ నమోదైందని, ఈసారి తుది పోలింగ్ శాతం వివరాలు సోమవారానికి వెల్లడవుతాయని ఆయన తెలిపారు.



కరీనా కపూర్ క్రైమ్ థ్రిల్లర్ 'దయారా'

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ ఖాన్ మరియు టాలెంటెడ్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా క్రైమ్ థ్రిల్లర్ 'దయారా'. ప్రముఖ దర్శకురాలు మేఘనా గుల్జార్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో కరీనా కపూర్ ఖాన్ డీసీపీ అజూని కోహ్లీగా, పృథ్వీరాజ్ సుకుమారన్ డీసీపీ రామన్ కుమార్‌గా ప్రత్యర్థి పోలీసు అధికారులుగా కనిపించనున్నారు. చట్టం వర్సెస్ న్యాయం, నకిలీ ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ అయిన రామన్ కుమార్‌పై మరో పోలీసు అధికారి అజూని కోహ్లీ దర్యాప్తు చేసే తీవ్రమైన సన్నివేశాలతో ట్రైలర్ ఎంతో ఆసక్తికరంగా సాగింది. జంగ్లీ పిక్చర్స్ మరియు పెన్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాను మేఘనా గుల్జార్ యదార్థ ఘటనల ఆధారిత సీరియస్ డ్రామాగా మలిచారు. సస్పెన్స్ మరియు హై-వోల్టేజ్ డ్రామాతో కూడిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 18న విడుదల కానుండగా, ప్రస్తుతం ఈ



మూడు సినిమాలతో మమిత బైజు హ్యాట్రిక్

'ప్రేమలు'తో ఒక్కసారిగా యూత్ క్రష్‌గా మారిన మమితా బైజు .. ఇప్పుడు ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్‌గా మారింది. తన క్యూట్‌నెస్‌తో కట్టిపడేసే ఈ మలయాళ ముద్దుగుమ్మ.. తాజాగా భారతీయ సినీ చరిత్రలోనే ఎవరూ సాధించని ఒక అరుదైన మైలురాయి చేరుకుంది. కేవలం 29 రోజుల వ్యవధిలో ఈ అమ్మడు నటించిన మూడు సినిమాలు వరుసగా రూ.200 కోట్లకుపైగా వసూలు చేసి.. హ్యాట్రిక్ కొట్టిన తొలి భారతీయ నటిగా చరిత్ర సృష్టించింది. ఎన్నో వాయిదాల తర్వాత జులై 23న వచ్చిన 'జననాయగన్' విజయాన్ని అందుకుంది. విజయ్ నటించిన చివరి చిత్రం కావడంతో భారీ అంచనాలు ఉండడంతో బాక్సాఫీస్ వద్ద ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఇందులో మమిత.. విజ్జి పాత్రలో ఆకట్టుకుంది. సూర్య కథానాయకుడిగా విశ్వనాథ్ అండ్ సన్స్..: భారీ చిత్రం విడుదలైన కొద్దిరోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.240 కోట్ల గ్రాస్‌తో ఘన విజయం సాధించింది. ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాలో మమిత నటన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అల్లరి చేసే పిల్లగా ఆకట్టుకున్న ఆమె.. అమ్మగానూ హృదయానికి హత్తుకునే నటనతో మెప్పించింది. బె÷-లతెహోమ్ కుటుంబ యూనిట్..: నివిన్ పౌలీతో కలిసి మమిత నటించిన ఈ మలయాళ చిత్రం ఆగస్టు 21న విడుదలై సంచలనం విజయం అందుకుంది.

విభిన్నమైన కథలతో..

'ఇరుముడి' జోష్ మీదున్న రవితేజ.. ఆలస్యం చేయకుండా వెంటవెంటనే రెండు సినిమాలను లైన్లో పెట్టిన విషయం తెలిసిందే. వాటిలో ఒకటి హసిత్ గోలీ దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మిస్తున్న సినిమా కాగా.. రెండోది వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో లక్ష్మణ్ నిర్మిస్తున్న సినిమా. ఈ రెండు సినిమాలూ రెండు భిన్నమైన కథాంశాలతో తెరకెక్కుతున్నట్టు సమాచారం. హసిత్‌గోలీ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైన్మెంట్‌తో సాగుతుందట. హీరో శ్రీవిష్ణు ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో హీరోయిన్లు కూడా ఖరారైనట్టు తెలిసింది. రవితేజకు జోడీగా ఐశ్వర్య రాజేష్ నటిస్తుండగా, శ్రీవిష్ణుతో మాళవిక మోహనన్ జతకట్టనున్నదని వినికిడి. ఈ సినిమా షూటింగ్ ఈ నెలలోనే మొదలు కానున్నది. కేవలం నాలుగు నెలల్లోనే ఈ సినిమా పూర్తి చేసి వచ్చే సంక్రాంతికి విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇక వివేక్ ఆత్రేయ సినిమా విషయానికొస్తే.. ఇది హారర్ కామెడీ జానర్ అని తెలిసింది. కథ నచ్చడంతో రవితేజ వెంటనే ఓకే చెప్పారట. ఇదే నిజమైతే రవితేజ నటిస్తున్న తొలి హారర్ కామెడీ సినిమా ఇదే అవుతుంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ దశలో ఉన్నది.



టాక్సిక్‌కు హాఫ్ స్టార్ రేటింగ్

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు కుమారుడు గౌతమ్ ప్రముఖ సోషల్ మీడియా రేటింగ్ యాప్ లెటర్‌బాక్స్ ద్వారా ఇచ్చిన సినిమా రేటింగ్‌లు ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. యశ్ హీరోగా నటించిన 'టాక్సిక్' సినిమాకు గౌతమ్ కేవలం హాఫ్ స్టార్ (0.5) ఇవ్వడం, అలాగే తన తండ్రి మహేష్ బాబు సినిమాలకే కాకుండా ఇతర స్టార్ హీరోల చిత్రాలకు ఇచ్చిన రేటింగ్‌లు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. గౌతమ్ లెటర్‌బాక్స్ ప్రొఫైల్ ప్రకారం.. అతను ఇప్పటివరకు వివిధ భాషలు మరియు జోనర్లకు చెందిన 400లకు పైగా సినిమాలను వీక్షించినట్లు తెలుస్తోంది. అయితే ఇతరులతో సంబంధం లేకుండా, సినిమాల కంటెంట్‌ను బట్టి స్వతంత్రంగా రేటింగ్‌లు ఇవ్వడం ఈ డిబేట్‌కు ప్రధాన కారణమైంది. తన తండ్రి మహేష్ బాబు నటించిన కల్ట్ క్లాసిక్స్ 'పోకిరి' మరియు '1: నేనొక్కడినే' సినిమాలకు గౌతమ్ 5 నక్షత్రాల రేటింగ్ ఇవ్వగా, 'బ్రహ్మోత్సవం' చిత్రానికి కేవలం 1 స్టార్ మాత్రమే ఇచ్చాడు. అలాగే 'నిజం', 'వంశీ' చిత్రాలకు 2 చొప్పున రేటింగ్ ఇచ్చాడు. కేవలం టాలీవుడ్ మాత్రమే కాకుండా పాన్-ఇండియా మరియు హాలీవుడ్ సినిమాలపై కూడా గౌతమ్ తన అభిప్రాయాలను పంచుకున్నాడు. 'బాహుబలి 2' చిత్రానికి 5 స్టార్లు ఇవ్వగా, 'పెళ్లిచూపులు', 'సీతారామం' సినిమాలకు 4.5 రేటింగ్ ఇచ్చాడు.



నవంబర్ 27న మైసా విడుదల

రిలీజ్ డేట్ ప్రకటించిన మేకర్స్

కథానాయిక రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' రవీంద్ర పుల్లె తెరకెక్కిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేసింది. ఈ చిత్రాన్ని నవంబరు 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ రిలీజ్ డేట్ ప్రకటన సందర్భంగా మేకర్స్ పంచుకున్న క్యాప్షన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. సహజంగానే ఆమె దృఢమైనది.. ఎంచుకున్న మార్గంలో భయం లేనిది.. చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం ఆమె సొంతం. మునుపెన్నడూ చూడని విధంగా 'మైసా' ప్రపంచంలో రష్మికను చూసేందుకు సిద్ధంగా ఉండండి అంటూ చిత్ర బృందం సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. మునుపెన్నడూ లేని విధంగా రష్మిక ఈ సినిమాలో పూర్తిస్థాయి యాక్షన్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి. రష్మిక కథానాయిక. పెళ్లి తర్వాత వీళ్లిద్దరూ కలిసి నటిస్తున్న చిత్రమిది. దసరా కానుకగా అక్టోబరు 16న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఇటీవలే చిత్ర బృందం స్పష్టం చేసింది.



Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com